సీనియర్ మహిళల వన్డే ట్రోఫీకి కరీంనగర్ క్రికెటర్

హైదరాబాద్, ఆట ప్రతినిధి: బీసీసీఐ ప్రతిష్టాత్మకంగా నిర్వహించే సీనియర్ మహిళల వన్డే ట్రోఫీ కోసం కరీంనగర్‌కు చెందిన యువ క్రికెటర్ కట్ట శ్రీవల్లి హైదరాబాద్ జట్టులో చోటు దక్కించుకుంది. శనివారం ఉప్పల్‌లోని రాజీవ్‌గాంధీ స్టేడియంలో సమావేశమైన హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) సెలక్షన్ కమిటీ.. పదిహేను మందితో కూడిన జట్టును ప్రకటించగా అందులో శ్రీవల్లి సభ్యురాలిగా ఉంది. బొమ్మకల్, శ్రీపురం కాలనీకి చెందిన కట్ట ఉమారాణి-లక్ష్మారెడ్డి దంపతులు చిన్న కూతురు అయిన శ్రీవల్లి.. కరీంనగర్ నుంచి హైదరాబాద్ జట్టుకు ఎంపికైన తొలి మహిళా క్రికెటర్‌గా నిలిచింది. శ్రీవల్లి ఎంపిక పడం ఉమ్మడి కరీంనగర్ జిల్లా క్రీడాభిమానులందరికీ గర్వకారణమని పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

బోణీ కొట్టాలని..!

నేడు గచ్చిబౌలిలో భారత్, మలేషియా ఫ్రెండ్లీ మ్యాచ్

హైదరాబాద్, ఆట ప్రతినిధి: నెలరోజుల క్రితం ఇంటర్ కాంటినెంటల్ కప్‌తో ఫుట్‌బాల్ అభిమానులను అలరించిన నగరం మరో అంతర్జాతీయ మ్యాచ్‌కు ఆతిథ్యమివ్వబోతోంది. సోమవారం గచ్చిబౌలిలోని జీఎంసీ బాలయోగి స్టేడియంలో భారత్, మలేషియా స్నేహపూర్వక మ్యాచ్ ఆడనున్నాయి. ఈ ఏడాది ఇప్పటిదాకా 10 మ్యాచ్‌లు ఆడిన భారత్.. ఆరింటిలో ఓడి నాలుగింటిని డ్రాతో ముగించింది. నేటి మ్యాచ్‌లో అయినా గెలిచి ఈ సీజన్‌ను విజయంతో ముగించాలని భారత్ భావిస్తోంది. ఈ మ్యాచ్ కోసం తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ అన్ని ఏర్పాట్లను పూర్తిచేసింది. రాత్రి 7:30 గంటల నుంచి మ్యాచ్ మొదలుకానుంది. మ్యాచ్ ఆరంభానికి ముందు క్రీడాభిమానులను అలరించేందుకు మ్యూజికల్ ప్రోగ్రామ్‌ను ఏర్పాటుచేశారు.

ఫార్ములా 4 రేసింగ్ చాంపియన్ అకిల్ అలీభాయ్

- గోవా ఏసెస్ జట్టుకు ఐఆర్ఎల్ ట్రోఫీ

కోయంబత్తూరు: ఇండియన్ రేసింగ్ ఫెస్టివల్ (ఐఆర్ఎఫ్)లో భాగంగా జరిగిన ఫార్ములా 4 ఇండియన్ చాంపియన్‌షిప్‌లో హైదరాబాద్ బ్లాక్‌బర్డ్స్ డ్రైవర్ అకిల్ అలీభాయ్ చాంపియన్‌గా నిలిచాడు. ఈ సీజన్ ఆరు రౌండ్లలో విజేతగా నిలిచిన అకిల్.. ఆదివారం ఇక్కడ నిర్వహించిన చివరి రెండు రౌండ్‌లలో 2,3 స్థానాల్లో నిలిచినప్పటికీ ట్రోఫీకి అవసరమైన పాయింట్లు సొంతం చేసుకోవడంతో అతడు చాంపియన్‌గా నిలిచాడు. ప్రముఖ తెలుగు సినిమా నటుడు అక్కినేని నాగచైతన్య బ్లాక్‌బర్డ్స్‌కు యజమానిగా వ్యవహరిస్తున్న విషయం విదితమే. ఇక ఇండియన్ రేసింగ్ లీగ్ (ఐఆర్ఎల్) ట్రోఫీని గోవా ఏసెస్ జేఏ జట్టు దక్కించుకుంది. చివరి రేసులో ఆ జట్టు డ్రైవర్లు రౌల్ హైమాన్, గాబ్రియేలా జిల్కోవా 1,2వ స్థానాల్లో నిలవడమే గాక గోవా చాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకోవడంలో కీలక పాత్ర పోషించారు.

ముగిసిన రాష్ట్రస్థాయి సెపక్‌తక్రా పోటీలు

నెల్లికుదురు, నవంబర్ 17: మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండల కేంద్రంలో నిర్వహించిన అండర్ 17, అండర్ 19 బాల, బాలికల 68వ ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి సెపక్‌తక్రా పోటీలు ఆదివారం ముగిశాయి. అండర్-17 బాలుర విభాగంలో కరీంనగర్‌కు ప్రథమ స్థానం దక్కగా రంగారెడ్డి, నిజామాబాద్ వరుసగా ద్వితీయ, తృతీయ స్థానాలు దక్కించుకున్నాయి. అండర్-17 బాలిక విభాగంలో కరీంనగర్, రంగారెడ్డి, వరంగల్ తొలి మూడు స్థానాల్లో నిలిచాయి. అండర్-19 బాల, బాలికల విభాగంలో వరంగల్ ప్రథమ స్థానం సాధించింది. క్రీడల్లో రాణించినవారికి ఉజ్వల భవిష్యత్ ఉంటుందని స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) ఆర్గనైజింగ్ సెక్రటరీ జి. సత్యనారాయణ, రాష్ట్ర పరిశీలకులు కృష్ణమూర్తి అన్నారు.

పిచ్‌ల మర్మమేమిటో!

విదేశీ క్రికెట్ జట్లు భారత పర్యటనకు వచ్చినా.. టీమ్‌ఇండియా ఇతర దేశాలకు వెళ్లినా క్రికెట్ విశ్లేషకులు, విమర్శకులు, అభిమానులు, ఆటగాళ్ల చర్చ అంతా 'పిచ్'ల గురించే.. ఆతిథ్య దేశాలు తమకు అనుకూలంగా పిచ్‌లను రూపొందించుకుంటూ పర్యాటక జట్లపై ఆధిపత్యం చెలాయిస్తున్న తరుణంలో ఎవరి నిర్ణయాన్ని వాళ్లే సమర్థించుకోవడం ఈ మధ్యకాలంలో సర్వసాధారణమైంది. మరి ప్రతిష్టాత్మక బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో భాగంగా ఆస్ట్రేలియా పర్యటనలో ఐదు టెస్టుల సిరీస్ సమరానికి సిద్ధమవుతోన్న రోహిత్ సేనకు కంగారూల అడ్డాలో ఎలాంటి పిచ్‌లు దర్శనమివ్వనున్నాయి? గత రెండు పర్యటనలలో భారత్ చేతిలో చతికిలపడి సిరీస్‌లను కోల్పోయిన అవమాన భారంతో ఉన్న ఆసీస్.. ఈసారి పూర్తిస్థాయిలో ప్రతీకారం తీర్చుకోవాలని చూస్తున్న తరుణంలో వేదికలు ఎలా స్పందించనున్నాయి? అనేది ప్రస్తుతం భారత క్రికెట్ అభిమానుల్లో చర్చనీయాంశమైంది.

నమస్తే తెలంగాణ క్రీడావిభాగం

ప్రతిష్టాత్మక బోర్డర్ గవాస్కర్ ట్రోఫీ (బీజీటీ)కి మరో 4 రోజుల్లో తెరలేవనుంది. ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా ఈనెల 22 నుంచి పెర్త్ వేదికగా భారత్, ఆస్ట్రేలియా మధ్య తొలి టెస్టు ప్రారంభం కానుంది. 1991-92 తర్వాత ఆస్ట్రేలియాలో భారత్ ఐదు టెస్టుల సిరీస్ ఆడనుండటం ఇదే ప్రథమం. ప్రపంచ వ్యాప్తంగా ప్రఖ్యాతిగాంచిన మైదానాలైన పెర్త్, అడిలైడ్, బ్రిస్బేన్, మెల్‌బోర్న్, సిడ్నీ వేదికలుగా ఈ టెస్టులు జరుగనున్నాయి. ఈ నేపథ్యంలో భారత్‌కు ఎలాంటి సవాళ్లు ఎదురుకానున్నాయి? బ్యాటింగ్, బౌలింగ్ ఫ్రెండ్లీ వికెట్లుగా పేరున్న ఆసీస్ పిచ్‌లు కంగారూలకు ఏకపక్షంగా సహకరిస్తాయా? పూర్తిస్థాయి జట్టుతో బరిలోకి దిగుతున్న ఆసీస్ పేసర్ల ధాటికి భారత్‌కు కష్టాలు తప్పవా? గత రెండు సీజన్లలో ఈ వేదికలపై భారత ప్రదర్శన ఎలా ఉంది?

గబ్బాకు చివరి రోజులు!

ఒకప్పుడు గబ్బా (బ్రిస్బేన్)లో మ్యాచ్ అంటేనే ఆస్ట్రేలియా ఊగిపోయేది. కానీ 2032 ఒలింపిక్స్‌కు సిద్ధమవుతున్న బ్రిస్బేన్.. ఈ స్టేడియాన్ని పూర్తి అథ్లెటిక్ స్టేడియంగా మార్చాలని భావిస్తున్నది. భారత్‌తో మ్యాచ్ తర్వాత మరో రెండు, మూడు టెస్టుల కంటే ఇక్కడ మ్యాచ్‌లు జరిగే అవకాశాలు తక్కువే. ఈ వేదికతో భారత్‌కు మధుర జ్ఞాపకాలున్నాయి. గత పర్యటనలో సిరీస్ 1-1తో సమం కాగా ఇక్కడ జరిగిన ఆఖరి టెస్టులో టీమ్‌ఇండియా 3 వికెట్ల తేడాతో అపూర్వ విజయం సాధించింది. రెండో ఇన్నింగ్స్‌లో ఆసీస్ నిర్దేశించిన 329 పరుగుల ఛేదనను భారత్ 7 వికెట్లు కోల్పోయి విజయవంతంగా పూర్తిచేయడమే గాక సిరీస్‌నూ వరుసగా రెండోసారి సొంతం చేసుకుంది. గిల్ (91), పంత్ (89) భారత విజయంలో కీలకపాత్ర పోషించారు. ఈ పిచ్ పేసర్లకు అనుకూలం. 2022-23లో సౌతాఫ్రికాతో ఇక్కడ జరిగిన టెస్టు రెండు రోజుల్లోనే ముగియడం తీవ్ర విమర్శలకు తావిచ్చింది. పిచ్‌పై ఉండే గడ్డి పేసర్లకు అనుకూలంగా ఉంటుంది. 2018 నుంచి ప్రస్తుత ఆసీస్ సారథి పాట్ కమిన్స్ ఇక్కడ 6 టెస్టులాడి ఏకంగా 36 వికెట్లు దక్కించుకున్నాడు.

మెల్‌బోర్న్ మరోసారి వరించేనా?

భారత్ గత రెండు పర్యటనలలో మెల్‌బోర్న్‌లో ఆడిన రెండు టెస్టులనూ గెలుచుకుంది. 2018లో విరాట్ కోహ్లీ, గత సీజన్‌లో అజింక్యా రహానే ఇక్కడ శతకాలు బాదారు. గిల్, సిరాజ్ టెస్టు అరంగేట్రాలు చేసింది ఇక్కడే. పేసర్లకు అనుకూలించినా ఆరంభంలో కాస్త కుదురుకుంటే బ్యాటర్లు ఇక్కడ పరుగులు రాబట్టొచ్చు. గత ఆరు సీజన్‌లలో ఆసీస్ ఇక్కడ 6 టెస్టులు ఆడితే అందులో 4 గెలిచి రెండింటిలో (ఆ రెండూ భారత్ చేతిలోనే) ఓడింది. ఇటీవల ఆస్ట్రేలియా 'ఏ'తో జరిగిన మ్యాచ్‌తో పాటు పాకిస్థాన్, ఆస్ట్రేలియా వన్డే సిరీస్‌లోనూ బంతిదే ఆధిపత్యం. మొదట బ్యాటింగ్ చేసే జట్టుకు ఇక్కడ విజయావకాశాలు ఎక్కువ.

సిడ్నీలో ఈసారి తిప్పేదెవరో?

ఆస్ట్రేలియాలోని అత్యంత పురాతన స్టేడియాల్లో ఒకటైన ప్రఖ్యాత సిడ్నీ క్రికెట్ గ్రౌండ్ (ఎస్‌సీజీ) ఈ సిరీస్‌లో ఆఖరి టెస్టుకు ఆతిథ్యమివ్వనుంది. పేస్‌తో పాటు స్పిన్‌కూ సహకరించే ఎస్‌సీజీలో భారత్ ఆడిన గత రెండు మ్యాచ్‌లనూ డ్రా చేసుకుంది. జనవరిలో ఇక్కడ జరుగబోయే ఐదో టెస్టులో వాతావరణ ప్రభావం పర్యాటక జట్టుపై అధికంగా ఉండనుంది. 2018లో భారత విజయానికి అడ్డుపడ్డ వరుణుడు.. 2022-23లో సౌతాఫ్రికాతో మ్యాచ్‌నూ సాగనివ్వలేదు. 2018 నుంచి ఇక్కడ ఆడిన 6 టెస్టులలో ఆస్ట్రేలియా 2 గెలిచి నాలుగింటిని డ్రా చేసుకుంది. ఆసీస్ బ్యాటర్ మార్నస్ లబూషేన్‌కు ఇక్కడ (ఆరు టెస్టులలో 81.55 సగటుతో 734 రన్స్) ఘనమైన రికార్డు ఉంది.

పెర్త్‌తో మొదలు..

బీజీటీలో తొలి టెస్టుకు పెర్త్ (అప్టస్ స్టేడియం) ఆతిథ్యమివ్వబోతోంది. వాస్తవానికి తమ దేశ పర్యటనకు వచ్చే జట్లను క్రికెట్ ఆస్ట్రేలియా (సీఏ).. బ్రిస్బేన్ టెస్టుతో ఆహ్వానం పలుకుతుంది. కానీ సంప్రదాయానికి భిన్నంగా ఈసారి దానిని పెర్త్‌కు మార్చారు. 2018-19లో స్టేడియాన్ని పునరుద్ధరించాక ఆస్ట్రేలియా.. ఇక్కడ భారత్‌తో తొలి మ్యాచ్ ఆడింది. ఆ టెస్టులో కంగారులు 146 పరుగుల భారీ తేడాతో విజయం సాధించారు. తొలి ఇన్నింగ్స్‌లో కోహ్లీ శతకంతో టెస్టులలో తన 25వ సెంచరీని ఇక్కడే పూర్తిచేశాడు. కానీ రెండో ఇన్నింగ్స్‌లో భారత్ 140 పరుగులకే ఆలౌట్ అయి భారీ అపజయాన్ని మూటగట్టుకుంది. 2018 నుంచి ఆస్ట్రేలియా ఇక్కడ ఆడిన 4 మ్యాచ్‌లలో ఒక్కటి కూడా ఓడలేదు. మొదట బ్యాటింగ్ చేయాల్సి వస్తే భారీ స్కోరు సాధించి తర్వాత ప్రత్యర్థిని తక్కువ స్కోరుకే పరిమితం చేసి మ్యాచ్‌లో పైచేయి సాధించడం ఇక్కడ ఆస్ట్రేలియన్లకు వెన్నతో పెట్టిన విద్య. తొలి మూడు రోజులు బ్యాటర్లతో పాటు పేసర్లకూ సమానంగా సహకరించే ఈ పిచ్ మ్యాచ్ ముగింపు దశకు చేరుకునేసరికి స్పిన్‌కు నుకూలంగా మారే అవకాశాలున్నాయి. ఆసీస్ స్పిన్నర్ నాథన్ లియన్ గత 4 మ్యాచ్‌లలో ఇక్కడ ఏకంగా 27 వికెట్లు పడగొట్టాడు. భారత్‌తో టెస్టుకు పూర్తి పేస్ పిచ్‌నే తయారుచేస్తున్నట్టు పిచ్ క్యూరేటర్లు ఇప్పటికే ప్రమాద హెచ్చరికలు చేసిన నేపథ్యంలో తొలి టెస్టు నుంచే పేస్ రుచి చూపేందుకు ఆసీస్ ప్రణాళికలు రచిస్తోంది.

వామ్మో.. అడిలైడ్

అడిలైడ్ ఓవల్ అంటేనే సగటు భారత క్రికెట్ అభిమాని వెన్నులో వణుకు. 2020-21 పర్యటనలో ఇక్కడ ఆడిన మొదటి టెస్టు రెండో ఇన్నింగ్స్‌లో భారత్ 36 పరుగులకే ఆలౌట్ అయి దారుణ పరాభవాన్ని కళ్లజూసింది. భారత టెస్టు క్రికెట్ చరిత్రలో ఇప్పటిదాకా ఇదే అత్యల్పం. ఈ భయానికి తోడు ఈసారి ఇక్కడ జరిగేది డే అండ్ నైట్ (పింక్ బాల్) టెస్టు. ఈ గ్రౌండ్‌లో ఆసీస్ ఆడిన ఒక్క డే అండ్ నైట్ టెస్టూ ఓడిపోలేదు. 2018 నుంచి ఇక్కడ ఆడిన 6 టెస్టులలో ఆసీస్ 5 గెలిచి ఒకదాంట్లో ఓడింది. 2018 టూర్‌లో భారత్ గెలిచింది. టాస్, రాత్రివేళ పరిస్థితులు ఇక్కడ కీలకంగా మారే అవకాశముంది. సంప్రదాయకంగా అడిలైడ్ పేసర్లకు స్వర్గధామం. 2018 నుంచి ఇక్కడ ఆడిన టెస్టులలో ఆసీస్ స్టార్ పేసర్ మిచెల్ స్టార్క్ 30 వికెట్లు తీశాడు.

శ్రీనివాస్‌కు మూడు స్వర్ణాలు

హైదరాబాద్, ఆట ప్రతినిధి: అమెరికాలోని కాలిఫోర్నియాలో ఈనెల 10 నుంచి 17 దాకా జరిగిన ఆరో ప్రపంచ క్యారమ్ చాంపియన్‌షిప్‌లో నగరానికి చెందిన కే. శ్రీనివాస్ మూడు స్వర్ణాలతో మెరిశాడు. భారత్ తరపున పురుషుల సింగిల్స్, పురుషుల డబుల్స్, టీమ్ చాంపియన్‌షిప్‌లో పాల్గొన్న శ్రీనివాస్.. మూడు విభాగాల్లోనూ అగ్రస్థానాన నిలిచి పసిడి పతకాలు సాధించాడు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌ను క్యారమ్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ (క్యాట్) జనరల్ సెక్రటరీ మదన్‌రాజ్, ఉపాధ్యక్షుడు సుధాకర్ ప్రత్యేకంగా అభినందించారు.

భారత్ టాప్ గేర్

రాజ్‌గిర్ (బీహార్): డిఫెండింగ్ చాంపియన్ భారత్ మహిళల ఏషియన్ చాంపియన్స్ ట్రోఫీ (ఏసీటీ) హాకీ టోర్నీలో విజయాల పరంపరను కొనసాగిస్తోంది. ఇప్పటికే ఈ టోర్నీలో సెమీస్ బెర్తును ఖాయం చేసుకున్న భారత అమ్మాయిలు.. ఆదివారం ఇక్కడ జరిగిన చివరి లీగ్ మ్యాచ్‌లో 3-0తో జపాన్‌ను చిత్తుచేసి పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో నిలిచారు. భారత్ నుంచి దీపిక (47, 48వ నిమిషాల్లో) వరుస గోల్స్ చేయగా నవ్‌నీత్ కౌర్ (37వ ని.) ఓ గోల్ సాధించింది. సెమీస్‌లో భారత్.. మంగళవారం జపాన్‌తో ఆడుతుంది.

రాహుల్ ఫిట్!

పెర్త్: ఆస్ట్రేలియాతో తొలి టెస్టుకు ముందు గాయాలబెడదతో సతమతమవుతున్న భారత జట్టుకు శుభవార్త. మూడురోజుల క్రితం గాయంతో ఇబ్బందిపడ్డ టీమ్‌ఇండియా స్టార్ బ్యాటర్ కేఎల్ రాహుల్ ఆదివారం బ్యాటింగ్ ప్రాక్టీస్ చేశాడు. పెర్త్ టెస్టు లో అతడు ఓపెనర్‌గా బరిలోకి దిగే అవకాశాలున్నాయి. ఇక రెండోసారి తండ్రి అయిన సారథి రోహిత్ శర్మ మరికొన్ని రోజులు ఇక్కడే ఉండనున్న నేపథ్యంలో పెర్త్‌లో పేసర్ జస్ప్రీత్ బుమ్రా భారత్‌ను నడిపించనున్నట్టు సమాచారం. మరోవైపు యువ ఆల్‌రౌండర్ నితీశ్ రెడ్డికి మొదటి టెస్టులో చోటు దక్కొచ్చన్న వార్తలూ వినిపిస్తున్నాయి.

చిత్రం

ఎక్కడా తగ్గని పుష్పరాజ్ మీ ప్రేమకు తలొంచాడు

''బీహార్ ప్రజలకు నా ప్రణామాలు. ఎక్కడా తగ్గని పుష్పరాజ్ మీ ప్రేమకు తలొంచాడు. థ్యాంక్యూ పాట్నా. దేశవ్యాప్తంగా ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురుచూస్తున్న సినిమా 'పుష్ప 2'. ఆ స్థాయిలో ప్రేక్షకులు ఈ సినిమాను సొంతం చేసుకున్నారు. డిసెంబర్ 5న సినిమా విడుదల కానుంది. మీ అంచనాలను మించి సినిమా ఉంటుంది'' అని అల్లు అర్జున్ అన్నారు. ఆయన హీరోగా రూపొందిన చిత్రం 'పుష్ప 2'. రెండేళ్ల క్రితం విడుదలై, దేశవ్యాప్తంగా భారీ విజయాన్ని అందుకున్న ''పుష్ప' చిత్రానికి సీక్వెల్‌గా ఈ సినిమా రూపొందిన విషయం తెలిసిందే. సుకుమార్ దర్శకత్వంలో మైత్రీ మూవీమేకర్స్ పతాకంపై నవీన్ యర్నేని, వై.రవిశంకర్ నిర్మించిన ఈ సినిమా డిసెంబర్ 5న ప్రపంచవ్యాప్తంగా పాన్ ఇండియా స్థాయిలో విడుదల కానుంది. బీహార్ రాజధాని పట్నాలో ఆదివారం ఈ సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్ ఘనంగా జరిగింది. ఈ వేడుకలో భాగంగా 'పుష్ప 2' ట్రైలర్‌ని కూడా లాంచ్ చేశారు. ఈ సందర్భంగా అల్లు అర్జున్ మాట్లాడారు. 'మీప్రేమను జీవితంలో మరిచిపోలేను. మీ అందరి అంచనాలను మించేలా సినిమా ఉంటుంది. డిసెంబర్ 5 కోసం మీలాగే నేనూ ఆతృతగా ఎదురుచూస్తున్నా. ఐలవ్యూ పాట్నా..' అని కథానాయిక రష్మిక మందన్నా అన్నారు. ఇంకా నిర్మాతలు నవీన్ యర్నేని, వై.రవిశంకర్ కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఇక 'పుష్ప2' ట్రైలర్ విషయానికొస్తే.. 'ఎవడ్రా వీడు.. డబ్బంటే లెక్కలేదు.. పవర్ అంటే భయం లేదు..' అనే జగపతిబాబు డైలాగ్‌తో ట్రైలర్ మొదలైంది. ట్రైలర్ ఆద్యంతం యాక్షన్ మోడ్‌లో సాగింది. డాన్‌గా మారిన పుష్పరాజ్‌ను ఈ ట్రైలర్‌లో చూడొచ్చు. భన్వరాల్ షకావత్‌గా ఫహద్ ఫాజిల్ పాత్ర అత్యంత శక్తిమంతంగా ట్రైలర్‌లో ఆవిష్కృతమైంది. అంతేకాక, పుష్పరాజ్, శ్రీవల్లీల దాంపత్యం నేపథ్యంలో వచ్చే సీన్స్ కూడా ఆకట్టుకునేలా ఉన్నాయి. మొత్తంగా మాస్ ఆడియన్స్ మెచ్చేలా ట్రైలర్ ఉంది.

అక్టోబర్ 2న కాంతారా చాప్టర్1



రెండేళ్ల క్రితం కన్నడలో రూపొంది, తెలుగులో అనువాదమైన 'కాంతార' చిత్రం ఎంతటి విజయాన్ని సాధించిందో తెలిసిందే. రిషబ్‌శెట్టి స్వీయ దర్శకత్వంలో కేవలం 16కోట్ల బడ్జెట్‌తో తెరకెక్కిన ఈ చిత్రం దాదాపుగా 450కోట్ల వసూళ్లు రాబట్టి, కన్నడ సినిమా ఖ్యాతిని పెంచింది. తెలుగు ప్రేక్షకులు కూడా ఈ సినిమాకు బ్రహ్మరథం పట్టారు. ప్రస్తుతం ఈ సినిమాకు ప్రీక్వెల్‌గా 'కాంతార చాప్టర్ 1' రూపొందుతున్న విషయం తెలిసిందే. కదంబుల కాలంలో సాగే కథాంశంతో ఈ సినిమా ఉండనుందని తెలుస్తున్నది. రిషబ్‌శెట్టి దర్శకత్వంలో హోంబలే ఫిల్మ్స్ పతాకంపై విజయ్ కింగరదూర్ నిర్మిస్తున్న ఈ భారీ పీరియాడిక్ డివోషనల్ యాక్షన్ థ్రిల్లర్ శరవేగంగా చిత్రీకరణ జరుపుకుంటున్నది. దేశవ్యాప్తంగా భారీ అంచనాలున్న ఈ సినిమా ఎప్పుడు విడుదల అవుతుందా అని సినీ అభిమానులంతా ఆసక్తిగా ఎదురుచూస్తున్న నేపథ్యంలో ఎట్టకేలకు ఈ సినిమా రిలీజ్ డేట్‌ను చిత్రబృందం ప్రకటించింది. వచ్చే ఏడాది అక్టోబర్ 2న 'కాంతార చాప్టర్ 1'ని విడుదల చేయనున్నట్టు ఆదివారం మేకర్స్ ప్రకటించారు. జయరామ్ ఇందులో కీలక పాత్ర పోషిస్తున్నారు. ఇందులో ఎన్టీఆర్ కూడా నటిస్తారని గతంలో వార్తలొచ్చాయి. రిషబ్ ప్లాన్ చేస్తే 'కాంతార'లో భాగం అవ్వడానికి తనకేం అభ్యంతరం లేదని తారక్ కూడా అన్నారు. మరేమవుతుందో చూడాలి.

ట్రోలర్స్ నన్ను ఏమీ చేయలేరు

విశ్వక్‌సేన్ కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం 'మెకానిక్ రాకీ'. రవితేజ ముళ్లపూడి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని ఎస్ఆర్‌టీ ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై రామ్ తాళ్లూరి, రజనీ తాళ్లూరి నిర్మించారు. మీనాక్షి చౌదరి, శ్రద్ధా శ్రీనాథ్ కథానాయికలు. ఈ నెల 22న ప్రేక్షకుల ముందుకురానుంది. ఆదివారం వరంగల్‌లో ప్రీరిలీజ్ వేడుకను నిర్వహించారు. ఈ సందర్భంగా హీరో విశ్వక్‌సేన్ మాట్లాడుతూ 'నేను సినిమా ఫంక్షన్స్‌లో మాట్లాడిన వీడియోలను కట్ చేసి..వాటిని సోషల్‌మీడియాలో పోస్ట్ చేస్తూ కొందరు వ్యక్తులు ట్రోలింగ్‌కు పాల్పడుతున్నారు. సోషల్‌మీడియా వేదికల్లో నన్ను ట్రోల్ చేసేవారి గురించి అస్సలు పట్టించుకోను. ట్రోలర్స్ నన్ను ఏమీ చేయలేరు. నా సినిమాల గురించి ఎవరు ఎలా విశ్లేషించినా ఫర్వాలేదు. అది వాళ్లకున్న స్వేచ్ఛ అనుకుంటా. కానీ నన్ను పర్సనల్‌గా అటాక్ చేస్తే మాత్రం ఊరుకోను. హిట్టయినా, ఫ్లాపయినా సినిమాలు చేస్తూనే ఉంటా. ఇప్పటివరకు నేను చేసిన సినిమాల్లో 'మెకానిక్ రాకీ' విభిన్నంగా నిలుస్తుంది. 21వ తేదీన పెయిడ్ ప్రీమియర్స్ వేస్తున్నాం' అన్నారు. నిర్మాత రామ్ తాళ్లూరి మాట్లాడుతూ 'విశ్వక్‌సేన్ చాలా కష్టపడి, ఇష్టపడి చేసిన సినిమా ఇది. ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా అందరినీ ఆకట్టుకుంటుంది' అన్నారు.

క్రైమ్‌ని కళ్లకు కట్టాడు

''మనం ఫైనాన్షియల్ క్రైమ్ గురించి వింటూ ఉంటాం. ఎలా జరుగుతాయో తెలీదు. ఈ సినిమాలో వాటిని దర్శకుడు కళ్లకు కట్టాడు. ఈ కథలో రెండు ప్రపంచాలుంటాయి. ఒకటి బ్యాంక్ ప్రపంచం, రెండోది గ్యాంగ్‌స్టర్ ప్రపంచం. ఇందులో గ్యాంగ్‌స్టర్‌గా కనిపిస్తా.'' అని హీరో డాలీ ధనంజయ్ తెలిపారు. సత్యదేవ్‌తో కలిసి ఆయన నటించిన యాక్షన్ ఎంటర్టైనర్ 'జీబ్రా'. ఈశ్వర్ కార్తీక్ దర్శకుడు. ఎస్.ఎన్.రెడ్డి, ఎస్.పద్మజ, బాలసుందరం, దినేష్ సుందరం నిర్మాతలు. నవంబర్ 22న సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా డాలీ ధనంజయ్ ఆదివారం విలేకరులతో మాట్లాడారు. 'వాణిజ్యవిలువల కలబోత ఈ చిత్రం. సత్యదేవ్‌తో నటించడం ఓ గొప్ప అనుభూతి. ఇందులో ప్రతి పాత్ర కీలకమే.' అని చెప్పారు. రవి బస్రూర్ సినిమాకు కొత్త సౌండ్ ఇచ్చారనీ, నిర్మాతలు పాషన్‌తో తీసిన ఈ సినిమా తప్పక సక్సెస్ అవుతుందని డాలీ ధనంజయ్ నమ్మకంగా చెప్పారు.

సారంగపాణి ప్రపంచం

ప్రియదర్శి, రూప కొడువాయూర్ జంటగా మోహనకృష్ణ ఇంద్రగంటి దర్శకత్వంలో శ్రీదేవీ మూవీస్ పతాకంపై రూపొందుతోన్న చిత్రం 'సారంగపాణి జాతకం'. డిసెంబర్ 20న సినిమా విడుదల కానుంది. ప్రమోషన్‌లో భాగంగా ఈ సినిమా టీజర్‌ని ఈ నెల 21న ఉదయం 11గంటల 12 నిమిషాలకు విడుదల చేయనున్నట్టు ఆదివారం మేకర్స్ ఓ ప్రకటన ద్వారా తెలియజేశారు. 'మనిషి భవిష్యత్తు చేతి రేఖల్లో ఉంటుందా? చేసే చేతల్లో ఉంటుందా? అనే ప్రశ్నకు జవాబు ఈ కథ. పరిపూర్ణ హాస్యకథా చిత్రం ఇది. మోహనకృష్ణ అద్భుతంగా తీశారు. ప్రేక్షకులకు మా సారంగపాణి ప్రపంచం ఎలా ఉంటుందో ఈ నెల 21న టీజర్ ద్వారా పరిచయం చేయాలనుకుంటున్నాం. షూటింగ్ పూర్తయింది. పోస్ట్‌ప్రొడక్షన్ కార్యక్రమాలు కూడా తుది దశకు చేరుకున్నాయి.' అని నిర్మాత శివలెంక కృష్ణప్రసాద్ తెలిపారు. ఈ చిత్రానికి కెమెరా: పీజీ విందా, సంగీతం: వివేక్ సాగర్.

పెళ్లి వార్త నిజమేనా?

కీర్తి సురేశ్ పెళ్లి ఖాయమైందట. తన చిరకాల మిత్రుడితో పెళ్లికి కీర్తి ఓకే చెప్పిందని, గోవా బీచ్ లొకేషన్‌లో పెళ్లి వేదికను ఫిక్స్ చేశారనీ, బంధుమిత్రుల సమక్షంలో ఈ జంట ఒకటవ్వబోతున్నారని బాలీవుడ్ మీడియాలో కథనాలు వెలువడుతున్నాయి. ఇప్పుడు అవే కథనాలు సౌత్ మీడియాలోనూ వ్యాపించాయి. నిజానికి ఈ తరహా వార్తలు కీర్తి సురేశ్‌కి కొత్తేం కాదు. గతంలో సంగీత దర్శకుడు అనిరుధ్‌తో తను ప్రేమలో ఉందని, త్వరలో పెళ్లాడబోతున్నదని కొన్ని కథనాలు సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టాయి. దుబాయికి చెందిన ఓ వ్యాపారితో పెళ్లి ఖాయమైందని కూడా ప్రచారం జరిగింది. అయితే.. వాటన్నింటినీ కీర్తి సురేశ్ సున్నితంగా ఖండించింది. ఇప్పుడు వినిపిస్తున్న వార్తలపై మాత్రం కీర్తి కానీ, ఆమె కుటుంబసభ్యులు కానీ స్పందించకపోవడం ప్రస్తుతం చర్చనీయాంశమైంది. త్వరలోనే ఈ పెళ్లిని అధికారికంగా ప్రకటిస్తారని కూడా ప్రచారం జరుగుతున్నది. మరి కీర్తి సురేశ్ కుటుంబం నుంచి ఎలాంటి సమాచారం వస్తుందో చూడాలి.

మహారాష్ట్రలో ఆటాపాటా

యువహీరో సిద్ధు జొన్నలగడ్డ హీరోగా రూపొందుతోన్న యూత్‌ఫుల్ ఎంటర్టైనర్ 'తెలుసుకదా'. స్టైలిస్ట్ నీరజ కోన ఈ సినిమా ద్వారా దర్శకురాలిగా మారారు. పీపుల్‌మీడియా పతాకంపై టి.జి.విశ్వప్రసాద్ నిర్మిస్తున్న ఈ చిత్రం షూటింగ్ శరవేగంగా జరుగుతున్నది. మహారాష్ట్రలో సిద్ధు జొన్నలగడ్డ, కథానాయిక శ్రీనిధి శెట్టిపై చిత్రీకరిస్తున్న సాంగ్‌తో తాజా షెడ్యూల్ మొదలైంది. 24 రోజులపాటు జరిగే ఈ ల